క్లుప్తంగా

చిరస్మరణీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్



ఏయూలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

విశాఖ విద్య: భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో సర్వేపల్లి విగ్రహానికి ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి రెండో రాష్ట్రపతిగా, మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేసిన ఘనతను సర్వేపల్లి రాధాకృష్ణన్ సొంతం చేసుకున్నారన్నారు. ఏయూకి రెండో వైస్ ఛాన్సలర్‌గా, ఫిలాసఫీ విభాగం అధ్యాపకుడిగా చిరస్మరణీయ సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డాక్టర్ వాసుదేవ, డా.వెంకటరావు, డా.వీర్రాజు, డా.నాగరాజు, డా.బెన్ని, డా.వీర్‌కుమార్, డా.అలీ, డా.కల్యాణి, డా.ముసుగు ప్రసాద్, డా.వీరభద్రం, డా.రాము. డాక్టర్ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పార్క్ ఆధునికీకరణ పనులు



పిఠాపురం కాలనీ పార్క్ వద్ద నిర్మిస్తున్న రక్షణ గోడ

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ పార్క్ రక్షణ గోడ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పార్క్ పరిస్థితి అధ్వానంగా ఉందని, ప్రహరీ శిథిలావస్థకు చేరడంతో ఏక్షణంలోనైనా కూలిపోయే అవకాశముందని గత నెలలో 'సాక్షి'లో 'కళావిహీనం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జీవీఎంసీ అధికారులు పార్క్ ఆధునికీకరణకు రూ.28 లక్షల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా పార్క్ చుట్టూ ఉన్న పాత గోడను తొలగించి నూతన ప్రహరీని నిర్మిస్తున్నారు.

జోన్-3లో 34 చలివేంద్రాల ఏర్పాటు



సీతమ్మధారలో చలివేంద్రం

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధిలో 34 చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జోనల్ కమిషనర్ పి.శివప్రసాద్ తెలిపారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఉపశమనం పొందేలా చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు చలివేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కీలక జంక్షన్ల మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారుల సౌకర్యార్థం చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.45 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 21 రోజులకు గాను రూ.16.45 లక్షలు నగదు, బంగారం 2.977 మిల్లీ గ్రాములు, వెండి 0.098 మిల్లీ గ్రాములు పలు దేశాలకు చెందిన డాలర్స్ ఒమన్ రియల్ 40, మలేసియా రింగ్గిట్ 1, కతర్ రియల్ 1, ఒక చెక్కు లభించాయని ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష తెలిపారు. శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవస్థానం సిబ్బంది హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

రేపటి నుంచి శ్రీవారి లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి లడ్డూ విక్రయాలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన సీతారాముల కల్యాణం నేపథ్యంలో శ్రీవారి లడ్డూలు అక్కడకు తరలించడంతో ఇక్కడ విక్రయాలు నిలిపివేశామని.. శనివారం నుంచి యథావిధిగా విక్రయాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



- రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు
- మద్దిలపాలెం, శివాజీపాలెం, ఎంవీపీ కాలనీల్లో దొంగతనాలు
- ఇళ్లలోకి చొరబడి మరీ మహిళల మెడలో బంగారు గొలుసులు లాక్కుని పరారు
- వారంలో 3 కేసుల నమోదు
- మహిళలు అప్రమత్తంగా ఉండాలంటున్న ఎంవీపీ పోలీసులు

వరుస చోరీలు.. జనం బెంబేలు

ఎంవీపీకాలనీ:

తూర్పు నియోజకవర్గంలో వరుస చోరీలతో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. వీరి ఆగడాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. తాగునీరు కావాలని ఒక చోట.. ఇల్లు అద్దెకు కావాలని మరో చోట.. ఇంట్లో ఎవ్వరూ లేరని నిర్ధారించుకుని ఇంకో చోట.. ఇలా మహిళలను టార్గెట్ చేసి మరీ గొలుసు దొంగతనాలు చేస్తున్నారు. ఈ ఘటనలతో ఎంవీపీ కాలనీతోపాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. ముందుగా ఆయా ఇళ్ల వద్ద పరిస్థితులపై రెక్కీ నిర్వహించి మరీ చోరీలకు పాల్పడటం కలకలం రేపుతోంది. ఈ ఘటనల్లో బాధితులందరూ ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు కేసుల దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు దొంగలను పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంతోపాటు నగరంలోని మహిళలంతా అప్రమత్తంగా ఉండాలని, కొత్తవారు, అపరిచితులను ఇంట్లోకి రానివ్వొద్దని, అనవసర చర్చలు జరపొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

తాగునీరు కావాలంటూ.. 4 తులాల గొలుసుతో పరార్



ఈ నెల 10న శివాజీపాలెంలో ఇద్దరు వ్యక్తులు గొలుసు దొంగతనానికి పాల్పడ్డారు. గుగిలపు శోభారాణి అనే మహిళ శివాజీపాలెం సాయిబాబు ఆలయ సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆమె ఇంట్లో పనిచేసుకుంటుండగా.. గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి విష్ణు అపార్ట్‌మెంట్ అడ్రస్ అడిగాడు. ఆమె ముందుకు వెళ్లి చూడాలని సూచించింది. అనంతరం అతడు తాగునీరు కావాలని అడగ్గా.. ఆమె ఇచ్చే ప్రయత్నం చేసే క్రమంలో శోభారాణి మెడలో ఉన్న 4 తులాల బంగారు గొలుసు లాక్కుని అక్కడే రోడ్డుపై వేచిచూస్తున్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు.

ఇంటి తలుపు గడియ విరగ్గొట్టి.. నగదు, బంగారం చోరీ

ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి సమీప శెట్టిబలిజ వీధిలో నివసిస్తున్న ఓ మహిళ ఈ నెల 11న సాయంత్రం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లింది. తిరిగి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి రాగా.. తలుపు గడియ విరగ్గొట్టి రూ.15 వేల నగదు, 10 గ్రాముల బంగారం దొంగతనానికి గురైనట్లు గుర్తించి ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో అదే ఇంటి మేడపై ఉంటున్న హేమంత్ అనే యువకుడే ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు.



వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించి.. 2 తులాల చైన్ లాక్కుని..



ఈ నెల 16న ఎంవీపీ కాలనీలో ఓ యువకుడు గొలుసు దొంగతనానికి పాల్పడ్డాడు. సేవాన లలిత(90) అనే వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ చేశాడు. ఎంవీపీ కాలనీ సెక్టార్-8లో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె నివసిస్తోంది. మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని ఓ యువకుడు ఇంట్లోకి ప్రవేశించి 2 తులాల బంగారు చైన్ లాక్కుని పరారయ్యాడు. ఆమె ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి మరీ ఈ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెల్లడమే ఇందుకు కారణం.

ఇల్లు అద్దెకు కావాలంటూ.. 8 తులాల గొలుసు చోరీ



ఈ నెల 15న మద్దిలపాలెం చైతన్యనగర్‌లో ఓ వ్యక్తి గొలుసు దొంగతనానికి పాల్పడ్డాడు. హేమలత అనే వృద్ధురాలు చైతన్యనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఇల్లు అద్దెకు కావాలని చెప్పి ఒంటరిగా ఉన్న సమయంలో ఓ వ్యక్తి ఆ వృద్ధురాలిని కలిశాడు. తరువాత రోజు మళ్లీ వచ్చి ఇల్లు చూపించాలని కోరడంతో ఆమె లోపలికి తీసుకెళ్లింది. ఆ సమయంలో బలంగా తోసేసి వృద్ధురాలి మెడలో ఉన్న 8 తులాల బంగారు గొలుసును ఒక్కసారిగా లాక్కుని పరారయ్యాడు. కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగింది.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



తూర్పు నియోజకవర్గంలో వరుస దొంగతనాల నేపథ్యంలో మహిళలంగా అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత వ్యక్తులతో ఎక్కువ సేపు మాట్లాడటం, కుటుంబ సభ్యులు లేని సమయంలో ఇళ్లలోకి వారిని తీసుకెళ్లడం వంటివి చెయవద్దు. గొలుసు చోరీలకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే శివాజీపాలెంలో ఓ మహిళ మెడలో గొలుసు లాక్కుని పరారైన ఇద్దరు యువకులను అరెస్ట్ చేశాం. మిగతా వారిని కూడా త్వరలోనే పట్టుకుంటాం. – చక్రధర్‌రావు, సీఐ, ద్వారకా క్రైం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ ప్రతినిధులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగేలా యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను గురువారం తన చాంబర్‌లో యూటీఎఫ్ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వారి బంగారు భవితకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్కూళ్లు బలోపేతమైతేనే అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రధానమైనదన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెరిగేలా ప్రతీ ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

భగవాన్‌దాస్‌కు భావ రచయిత అవార్డు



ఆరిలోవ: ఆరిలోవ టీఐసీ పాయింట్‌కు చెందిన ఉత్తరాంధ్ర సంగీత జానపద కళా పీఠం వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రట్టి భగవాన్‌దాస్‌ను కళా రంగంలో ఉత్తమ భావ రచయిత అవార్డు వరించింది. ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ ఆదిలీల ఫౌండేషన్ కల్చరల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 2025 సంవత్సరం ఉగాది పురస్కార ప్రధానోత్సవంలో ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన గురువారం తెలిపారు. కళా పీఠం ఆధ్వర్యంలో మూడేళ్లుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం, పిల్లలకు జానపదాలపై శిక్షణ ఇవ్వడం, పలు రచనలకుగాను అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇంతవరకు తాను 10 పుస్తకాలు రచించినట్లు తెలిపారు. ఇటీవల రచించిన శ్రీసాయి స్వర కుసుమాలు, ప్రజాహితములు ఆవిష్కరించాల్సి ఉందన్నారు.

కరకచెట్టు పోలమాంబ ఆదాయానికి గండి

- జాతర ఆదాయం రూ.23 లక్షలే
- ఉత్సవ కమిటీలో అనధికార సభ్యులు
- పక్కదారి పట్టిన విరాళాలు

బీచ్‌రోడ్డు: 14 గ్రామాల దేవత పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవాలయ ఆదాయానికి కొంత మంది గండి కొట్టారు. జాతర ఉత్సవాల కోసం 11 మంది సభ్యులతో కమిటీని నియమించగా.. అందులో కూటమి నాయకులు అనధికారంగా మరో 14 మందిని సభ్యులుగా చేర్చారని సమాచారం. దీంతో అమ్మవారికి భక్తులు ఇచ్చే విరాళాలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఉత్సవ్ కమిటీ సభ్యులు టికెట్ల రూపంలో రావాల్సిన ఆదాయాన్ని రాకుండా వందల మంది భక్తులను నేరుగా దర్శనానికి తీసుకెళ్లిపోయారు. దీతో ఆ ఆదాయం కూడా రాకుండా పోయింది. ఈ అనధికార సభ్యులను దేవాలయంలోని అధికారులు ప్రోత్సహించారని ఆరోపణలున్నాయి. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఖర్చు రూ.30 లక్షలు.. ఆదాయం రూ.23 లక్షలు

పోలమాంబ జాతర కోసం రూ.30 లక్షలు ఖర్చు చేయగా.. రూ.40 లక్షలు ఆదాయం వస్తుందనుకుంటే.. కొంత మంది చేతివాటం వల్ల రూ.23 లక్షలకే పరిమితమైంది. వీటిలో టికెట్లు, విరాళాల ద్వారా రూ.13 లక్షలు రాగా.. హుండీ ద్వారా రూ.9.63 లక్షలు ఆదాయం వచ్చింది. సుమారు రూ.15 లక్షల మేర అమ్మవారి ఆదాయానికి గండి పడింది.



హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు

హుండీ ద్వారా రూ.9.63 లక్షల ఆదాయం

అమ్మవారి జాతర 20 రోజుల్లో భక్తులు హుండీలో వేసిన విరాళాలను గురువారం అధికారులు లెక్కించారు. మొత్తం రూ.9,63,511 హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఈవో గాయత్రి తెలిపారు. పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మూడో పట్టణ పోలీసుల సమక్షంలో ఆదాయం లెక్కించినట్లు ఆమె చెప్పారు.

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీతో కళ్లద్దాలకు చెక్

ఆరిలోవ: కళ్లలో కార్నియా ఒంపును సరిదిద్దడానికి లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ చాలా అనుకూలమైనదని, దాని ద్వారా కళ్లద్దాలు వినియోగించాల్సిన అవసరం ఉండదని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ మారియా బషీర్ తెలిపారు. హనుమంతవాక వద్ద ఆస్పత్రిలో గురువారం రోగులకు మయోపియా, హైపర్‌మెట్రోపియా తదితర సమస్యలపై ఆమె అవగాహన కల్పించారు. సాధారణంగా మయోపియా(దగ్గరి చూపు), హైపర్‌మెట్రోపియో(దూర చూపు), ఆస్టిగ్మాటిజం(వక్రదృష్టి)లను సరిచేయడానికి లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ చేస్తారని చెప్పారు. ఇది కంటికి సురక్షితమైనదన్నారు. ఈ సర్జరీ చేయడానికి రోగి వయసు కనీసం 21 ఏళ్లు దాటాలని, కంట్లో నీటికాయలు, శుక్లాలు తదితర వ్యాధులు ఉండకూడదని వివరించారు. ఈ సర్జరీ ద్వారా కళ్లద్దాలపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చన్నారు. కంటి నిర్దిష్ట అవసరాల ఆధారంగా ఈ సర్జరీలు పలు రకాలుగా ఉంటాయన్నారు. దీనిపై రోగులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ బషీర్ సూచించారు.

పౌష్టికాహారం.. పిల్లలకు వరం



సంతపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సెల్వియా

ఆరిలోవ: పౌష్టికాహారంపై పిల్లల తల్లులు అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.సెల్వియా అన్నారు. జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పఖ్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో రమణకుమారి సూచనల మేరకు అంగన్‌వాడీ పిల్లల తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మహిళలు గర్భిణి దశ నుంచి రెండేళ్ల వరకు స్వయంగా తమంతట తామే పోషణ ట్రాకర్లను నమోదు చేసుకోవాలన్నారు. కమిటీ నిర్వహణ కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా చిన్నారులకు మంచి పోషణ జరిగి, పోషకాహార లోపం తగ్గుతుందని వివరించారు. పిల్లలకు పోషకాహారం అందించడం వల్ల ఆరోగ్యకరమైన జీవనశైలి వారికి అలవాటవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తులసి, కామేశ్వరి, అన్నపూర్ణ, గంగాభవాని పాల్గొన్నారు.

విద్యార్థి మయూఖ్‌కు హోం మంత్రి ప్రశంస



ఆరుద్ర మయూఖ్‌ను అభినందిస్తున్న హోం మంత్రి అనిత

బీచ్‌రోడ్డు: ద్వారకానగర్ బీవీకే కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న భాగవతుల ఆరుద్ర మయూఖ్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రశంసించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన 'మహిళల రక్షణకు కలిసికట్టుగా' అనే కార్యక్రమంలో 'నిశ్శబ్దం హింసను ప్రేరేపిస్తుందా' అనే అంశంపై ఆరుద్ర మయూఖ్ ప్రసంగించాడు. ప్రస్తుత సమాజంలో యువత తీరును ఎండగడుతూ, సమకాలీన అంశాలతో చరిత్రను అనుసంధానం చేసి ప్రసంగించిన తీరు సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమం ముగిశాక తిరిగి వెళ్తున్న సందర్భంలో మయూఖ్‌ను హోం మంత్రి ప్రత్యేకంగా పిలిచి అభినందించారు. మీలాంటి యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కూడా మయూఖ్‌ను అభినందించారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఆరిలోవ పోలీస్ స్టేషన్ సీఐ మల్లేశ్వరరావుకు, కళాశాల ప్రిన్సిపాల్ పి.రత్నశేఖర్‌కు మయూఖ్ కృతజ్ఞతలు తెలిపాడు.

వాల్తేర్ డిపో ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న వాల్తేర్ డిపో ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వాల్తేర్ డిపో ఉద్యోగులు గురువారం నిరసనకు దిగారు. ఎస్‌ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారానికి ప్లకార్డులు ప్రదర్శిస్తూ డిపో ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం డిపో చైర్మన్ బి.రవి మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో వినియోగంలోకి రానున్న ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ ఉద్యోగుల ద్వారానే నడపాలని, ఉద్యోగులకు పాత విధానంలోనే వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. నైట్ అలవెన్స్‌లు రూ.150 నుంచి రూ.400కు పెంచాలని కోరారు. అక్రమ సెస్పన్షన్లు ఆపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డిపో ఎండీకి మెమరాండం సమర్పించారు. యూనియన్ డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు, గ్యారేజ్ అధ్యక్షుడు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్మికుల సమస్యలపై ధర్నా



ఆశీలమెట్ట జోన్-3 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీలో 30 ఏళ్లు పనిచేసి రిటైరైన కాంట్రాక్ట్ కార్మికులు(ఆప్కాస్), అకాల మరణం పొందిన కార్మికులు, అనారోగ్యం పాలై వైద్యం పొందుతున్న కార్మికుల కుటుంబాల బిడ్డలకు తక్షణం ఉపాధి కల్పించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆశీలమెట్ట జోన్-3 కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు దాటినవారు, చనిపోయినవారు, అనారోగ్యం పాలైన కార్మికుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీచేయడం లేదన్నారు. 2023 ఆగస్టులో నాటి కమిషనర్ రాతపూర్వకంగా మినిట్స్ రూపంలో కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పిస్తామని చేసిన ఒప్పందాన్ని తుంగలో తొక్కారన్నారు. కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా వారి డబ్బులతోనే చీపుర్లు వంటివి కొనిపించడం జీవీఎంసీకే అవమానకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆప్కాస్ పెట్టి అందులో మున్సిపల్ కార్మికులను చేర్పిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి కాంట్రాక్టర్ల వ్యవస్థను తెస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. తక్షణమే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జోన్-3 కమిటీ కార్యదర్శి జె.ఆర్.నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని, జీవీఎంసీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికులను పర్మినెంట్ చేయాలని, క్లాప్ డ్రైవర్లు, బదిలీ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.కుమారి, పి.వెంకటరావు, ఆర్.శ్రీనివాస్, ఇ.ఆదినారాయణ, కొండమ్మ, విజయ, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి అదృశ్యంపై వేర్వేరుగా కేసుల నమోదు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళలు, ఓ బాలిక అదృశ్యంపై వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. ఈ ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలిలా..

భార్య అదృశంపై భర్త ఫిర్యాదు

వెంకోజీపాలేనికి చెందిన చింతాడ సాయి, చింతాడ సావిత్రి దంపతుల మధ్య కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ రాత్రి గొడవ జరిగింది. అనంతరం రాత్రి వారు నిద్రపోగా.. తెల్లవారు లేచి భర్త చూసేసరికి భార్య సావిత్రి కనిపించలేదు. కుటుంబ సభ్యులను సంప్రదించినా ఫలితం లేకపోయింది. భర్త సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి అదృశ్యంపై కొడుకు ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ సెక్టార్-1లో నివసిస్తున్న దన్నన వంశీ తన తల్లి దన్నన సుధ కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల వంశీ తన సోదరి ఇంటికి ఊరు వెళ్లి ఈ నెల 15న తిరిగి రాగా.. తల్లి కనిపించలేదు. పలు చోట్ల ఆరా తీసిన ఆచూకీ లేకపోవడంతో గురువారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కూతురి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

అప్పుఘర్‌కు చెందిన బాలిక అదృశ్యంపై తండ్రి గిరికిన దేముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. తన దగ్గర పని చేస్తున్న ఓ యువకుడు తన కూతురిని ప్రేమిస్తున్న విషయం తెలిసి కూతుర్ని తండ్రి ప్రశ్నించగా.. గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లి వస్తానని చెప్పిన బాలిక ఇంటికి తిరిగి రాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 7 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్, శశాంక్, ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన అశ్విని ప్రధాన్‌లు విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా ఆయా ప్రాంతాలకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని, రూ.35 వేల విలువ గల 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్‌ఐలు కె.శాంతారం, ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎఎస్‌ఐలు పి.శివనారాయణ, ఎస్.చిట్టిబాబులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొట్లాటలో ఇరువర్గాలపై కేసు

ఎంవీపీకాలనీ: ఈ నెల 15న జాలరిపేటలోని రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాట ఘటనపై ఎంవీపీ పోలీసులు ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేశారు. రామోలు రాధ, రమేష్ దంపతులు 15వ తేదీ రాత్రి గొడవ పడుతుండగా.. పక్కనే ఉంటున్నా సతీష్, పోలయ్య, పెద్దయ్య అనే ముగ్గురు వ్యక్తులు నవ్వుతుండటంతో రమేష్‌కు అల్లుడయ్యే సురేష్ వారిని ప్రశ్నించాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ పెరిగి కొట్లాటకు దారితీసింది. కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మే నాటికి ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలి



ఆర్‌వోబీ పనులు పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: రైల్ ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) పనులు ఎట్టి పరిస్థితుల్లోను మే నెలాఖరు నాటికి పూర్తి చేసి బ్రిడ్జ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన గురువారం పలు ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా సెంట్రల్ నర్సరీలో సుమారు రూ.93 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎన్ఏడీ ఫ్లైఓవర్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఇంజనీర్లు, గుత్తేదారు ప్రతినిధిని అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, కార్య నిర్వాహక ఇంజనీర్ మధుసూదనరావు, డీఎఫ్‌వో సుజాతా శివానీ, సహాయక ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.